నేనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే

- విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యం పెట్టుకోవాలి
- విద్యార్థులకు సన్మానంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ) : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యం ఏర్పాటుచేసుకొని.. ఆ దిశగా ముందుకుసాగాలని డీజీపీ జితేందర్ సూచించారు. తానూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి డీజీపీ స్థాయికి ఎదిగినట్టు తెలిపారు. గురుకులాల్లో ప్రవేశం పొందిన 68మంది నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీజీపీ జితేందర్ సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థి దశ ఎంతో అమూల్యమైందని, ఈ సమయంలో చెడుఅలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అక్షయ విద్య స్థాపకుడు వరప్రసాద్, సలహాదారు, ఐజీ ఎం రమేశ్, ఇండియా సీఎస్ఆర్ హెడ్ మిచెల్లే డొమినికా, ఫౌండేషన్ స్థాపక ట్రస్టీ జనార్దన్, అకడమిక్ అడ్వైజర్ అరుంధతి, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్‌చౌహాన్ పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సెలింగ్ రిజర్వేషన్లను సరిదిద్దాలి

మంత్రి రాజనర్సింహకు బీసీ నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు అనుసరిస్తున్న రిజర్వేషన్లు పూర్తిగా అసంబద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే సరిదిద్దాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. పలువురు బీసీ సంఘాల నేతలతో కలిసి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శనివారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న అక్రమాలపై చర్చించారు. కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు విధానం లోపభూయిష్టంగా ఉందని, ఏటా 300 మంది సీట్లు కోల్పోతున్నారని వివరించారు. కృష్ణ, రామకృష్ణ, రాజేందర్, అనంతయ్య, సతీశ్, శంకర్, నిఖిల్, బలరామ్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

ట్రిపుల్ ఆర్‌కు మా భూములియ్యం

అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

తేల్చి చెప్పిన గిర్మాపూర్, పెద్దాపూర్ రైతులు

సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

సంగారెడ్డి, ఆగస్టు17 : ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. శనివారం సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏర్పాటు చేసిన సమావేశాన్ని కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. అంతకు ముందే ఆయా గ్రామాల్లో ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేది లేదంటూ గ్రామస్థులంతా ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా గ్రామాల మీదుగా జాతీయ రహదారి, పెద్దాపూర్ ఫిల్టర్‌బెడ్, మంజీర పైపులైన్, చెరువులు, కాల్వల నిర్మాణానికి భూములు తీసుకుని తమను కూలీలుగా మార్చారని మండిపడ్డారు. ఇప్పటికే నాందెడ్-అకోలా జాతీయ రహదారి శివ్వంపేట నుంచి కంది ఐఐటీ వరకు వెళ్తున్నదని చెప్పారు. ఈ రోడ్డును చింతల్‌పల్లికి జతచేయడంతో చింతల్‌పల్లి, తాళ్లపల్లి, కల్వగూర్, కులబ్‌గూర్, ఇరిగిపల్లి, గిర్మాపూర్, పెద్దాపూర్‌లో భూసేకరణ మిగిలిపోతుందన్నారు. ప్రభుత్వానికి బడ్జెట్ మిగులుతుందని, ఈ విషయాన్ని గుర్తించి గిర్మాపూర్-పెద్దాపూర్ నుంచి అలైన్‌మెంట్ మార్చాలని వారు కోరారు. వీరికి రైతు సంఘాల నాయకులు జయరాజు, పృథ్వీరాజ్, టీజేఎస్ తుల్జారెడ్డి మద్దతిచ్చారు.

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా గాంధీ దవాఖానలో నిరసన తెలుపుతున్న వైద్యులు

కదం తొక్కిన వైద్యులు

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై పెల్లుబికిన నిరసనలు
- రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలు బంద్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ) : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు కదం తొక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపు మేరకు ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో శనివారం ఓపీ సేవలు బంద్ చేశారు. వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు భారీ ర్యాలీలు తీశారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో డ్యూటీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ ఈ ఘటనను ఖండిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కఠినంగా వ్యవహరించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. వైద్యుల ధర్నాలకు వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, కార్యదర్శి కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహిస్తూ హంతకులను కాపాడే ప్రయత్నం చేస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పేర్కొన్నారు.

గ్రామాస్థాయిలో రెవెన్యూ అధికారి ఉండాలి

రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): భూసంబంధిత వివరాల సేకరణకు, ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడానికి గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారిని నియమించాలని పలువురు వక్తలు కోరారు. గ్రామాలవారీగా రికార్డులు తయారు చేసి, డిజిటలైజ్ తోపాటు మ్యానువల్ కూడా రూపొందించాలని సూచించారు. పహాణీ, కాస్తు కాలం కొనసాగించాలని కోరారు. తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు-2024పై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని వైవీ కృష్ణారావు రైతుభవన్‌లో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ రంగ నిపుణులు నరసింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదులు వేణుగోపాల్, రాజ్‌రెడ్డి, గోకుల్, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, సామాజిక కార్యకర్త సాధిక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు జియో రిఫరెన్సింగ్

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన భూములు, ఇతర స్థిరాస్తులను జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ ద్వారా సంరక్షించనున్నట్టు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ రాలేని పరిస్థితిని తీసుకొచ్చేందుకే ఈ విధానాన్ని అనుసరించనున్నట్టు తెలిపారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీరాక్) సంస్థ కార్యకలాపాలపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగాత్మకంగా ఆర్టీసీ, హోంశాఖ భూముల కోసం జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. టీజీ రాక్ ఏడీజీ మనోహర్, అర్థగణాంక శాఖ డైరెక్టర్ రుఫస్, నరసింహాచారి, శివప్రసాద్ పాల్గొన్నారు.

కులగణన చేయకుంటే సర్కారుపై యుద్ధమే

- సాధనే లక్ష్యంగా ఈ నెల 22 నుంచి ఉద్యమం
- వచ్చేనెల 6న హైదరాబాద్ దిగ్బంధం: జాజుల

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి,ఆగస్టు17: సమగ్ర కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. కులగణన సాధనే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందాల గణేశాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల మాట్లాడారు. ఈ నెల 22న అఖిలపక్ష పార్టీల సమావేశం, 26 జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, సెప్టెంబర్ 6 లక్షలాది మంది బీసీలతో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధిస్తామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించి బీసీ కులగణన ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ చెప్పిన కులగణన బూటకమని, ఆయన మాటకు ఆ పార్టీలో విలువేలేదని పేర్కొన్నారు. ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ప్రాణత్యాగానికి వెనుకాడబోమని జాజుల స్పష్టం చేశారు. బాల్‌రాజ్ గౌడ్, వేముల వెంకటేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ్ బయోకు ఎలాంటి హామీ ఇవ్వలేదు

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో భాగంగా స్వచ్ఛ్ బయో సంస్థకు ప్రయోజనం కల్పించే ఎలాంటి హామీని తాము ఇవ్వలేదని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. తాము సంతకం చేసింది జెనరిక్ ఎంవోయూ మాత్రమేనని చెప్పారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తమ విదేశీ పర్యటన వివరాలను మంత్రి వెల్లడించారు. స్వచ్ఛ్ బయో సంస్థ ఇటీవల ఏర్పడి ఉండవచ్చు కానీ అది సుగనిత్ రెన్యూవబుల్స్‌తో అధికారిక భాగస్వామ్యంలోకి ప్రవేశించిందని తెలిపారు. 9 రోజుల తమ పర్యటన విజయవంతమైందని, 25కంపెనీలతో రూ. 36వేల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని చెప్పారు.

ఐపీవో పేరుతో 5 కోట్లు లూటీ

సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు • ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): బంగారం కంపెనీ ఐపీఓకి వచ్చిందని, పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ఆశచూపి.. ఓ వ్యక్తి నుంచి రూ.5.40 కోట్లను లూటీ చేసిన ఇద్దరు అన్నదమ్ములను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేసినట్లు శనివారం సీఎస్‌బీ డైరెక్టర్, డీజీ శిఖాగోయెల్ తెలిపారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి కేరళలో రూ.8.5 కోట్లకు పైగా అప్పుతో రెండు చారిటబుల్ ట్రస్ట్‌లను నిర్వహిస్తున్నాడు. అతనికి ట్రేడింగ్‌పై అవగాహనతో 8918520578 నంబర్ నుంచి వాట్సాప్‌తో "B6/Stock Visionaries" ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులో జూన్ 8న యాడ్ చేయబడ్డాడు. అప్పటికే ఆ గ్రూప్‌లో కొందరు లాభాలు వస్తున్నాయని మెసేజ్‌లు చేస్తుండటంతో నిజమేనని నమ్మాడు. అనంతరం లిడియా శర్మ అనే మహిళ 'గోల్డ్ మన్ సాక్స్' అనే ఇండియా కంపెనీ ఐపీవోకు సిద్ధంగా ఉందని, దాంట్లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయిని మెసేజ్ చేసింది. స్పందించిన ఫిర్యాదుదారుడు.. ఆమెకు మెసేజ్ చేశాడు. ఆమె సూచన మేరకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించి జూలై 10న రూ.30వేలతో ప్రారంభించి జూలై 25 నాటికి రూ.5,40,47,000 పెట్టాడు. వాటిని విత్‌డ్రా చేసుకునే ప్రయత్నంలో సైబర్ మోసగాళ్లు మరింత పెట్టాలని ఆదేశించడంతో.. మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన రాంపిల్ల కొండల్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్‌ను విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు.

ఎన్‌సీఎస్ఎఫ్‌ను తెరిపించాలి

మాట్లాడుతున్న చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్లు

సారంగాపూర్, ఆగస్టు 17 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సారంగాపూర్ ఎన్‌సీఎస్ఎఫ్‌ను వెంటనే తెరిపించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్లు ఆకుల పాపయ్య, సిర్ప నాగయ్య డిమాండ్ చేశారు. అర్సపల్లిలో అఖిల భారత రైతు కూలీ సంఘం, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం చెరుకు రైతుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో మంత్రి శ్రీధర్‌బాబుని రైతు ప్రతినిధులు కలిసినప్పుడు ఎన్‌సీఎస్ఎఫ్‌ను ప్రారంభిస్తామని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఫ్యాక్టరీకి పూర్వవైభవం తెస్తామని హామీఇచ్చారని తెలిపారు. అసెంబ్లీలో కనీసం ఫ్యాక్టరీ ప్రస్తావన తీయకపోవడం బాధాకరమన్నారు. ఫ్యాక్టరీలను తెరిపించాలని,లేకపోతే ఆందోళనలు చేపట్టి రేవంత్‌రెడ్డి సర్కార్‌కు తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. .

త్వరలోనే ఆలయ పాలక మండళ్ల ఏర్పాటు

సుభాష్‌నగర్, ఆగస్టు 17 : ఉమ్మడి జిల్లాలో ఆలయ పాలక మండళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహాయ కమిషనర్ విజయరామారావు తెలిపారు. సారంగపూర్ హనుమాన్ ఆలయాన్ని శనివారం దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆర్మూర్ జంబి హనుమాన్, జాన్కంపేట్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, బోధన్‌లోని మారుతీ మందిరం, దోమకొండ చాముండేశ్వరీ దేవి ఆలయం, గుండారం రామస్వామి మందిరం, రెంజల్‌లోని నీల నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. బడా రాంమందిరంలో అన్యాక్రాంతమైన భూములకు సర్వే చేపట్టి, శాఖ ఆదీనంలోకి తెచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, ఆలయ ప్రధాన అర్చకుడు శశికాంత్ తదితరులు ఉన్నారు.

పోడుభూముల పంపిణీపై వివరాలను అందించాలి

- రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ
- మంత్రి సీతక్కతో కలిసి ఎమ్మెల్యేలు, కలెక్టర్లలో వీడియోకాన్ఫరెన్స్

వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క

కంతేశ్వర్, ఆగస్టు 17 : పోడు భూముల పంపిణీకి సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు పోడు పట్టాల కోసం వచ్చిన క్లెయిమ్‌లు, ఎంతమందికి ఎన్ని ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. తదితర అంశాలపై జిల్లాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రెండు విడుతల్లో పోడు పట్టాల పంపిణీ జరిగిందని, ఇంకా గిరిజనుల నుంచి వినతులు వస్తున్నాయని, నిబంధనలకు అనుగుణంగా అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామంలోని అటవీ భూమిలో చెట్లను యథేచ్ఛగా నరికి కబ్జాకు పాల్పడుతున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తెలియజేయగా.. తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రూరల్ నియోజకవర్గంలో 7 మండలాల్లో పోడుభూముల సమస్య నెలకొని ఉన్నదని, అర్హులకు న్యాయం చేయాలని, గ్రామాలకు రవాణా వసతి మెరుగుపర్చేందుకు రోడ్లు నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి కోరారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగూరావు, అటవీ శాఖ డివిజనల్ అధికారి భవానీశంకర్ పాల్గొన్నారు.

పాలాలకు వెళ్లే దారి కబ్జా

- సీపీ కార్యాలయానికి తరలివచ్చిన తల్వేద రైతులు

వినాయక్‌నగర్, ఆగస్టు 17 : తమ పంట పొలాలకు వెళ్లే దారిని కబ్జా చేసి, దారి లేకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నందిపేట్ మండలంలోని తల్వేద గ్రామ రైతులు సీపీ కార్యాలయానికి శనివారం తరలివచ్చారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశవేణుతో కలిసి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. 24 ఏండ్లుగా తాము నడుస్తున్న దారిని తన మడిలోకి కలుపుకొని, తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

20 నుంచి ఓటరు జాబితా సవరణ

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

కంతేశ్వర్, ఆగస్టు 17 : ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ లోకేశ్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా చేపట్టడంపై పలు సూచనలు చేశారు. సవరణపై అభ్యంతరాలను నవంబర్ 28 వరకు స్వీకరించి, డిసెంబర్ 24లోగా పరిష్కరించాలని సూచించారు. 2025 జనవరి 6వ తేదీన ఓటరు తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహణపై నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా బీఎల్‌వోలకు అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.

ఘనంగా యువ కళోత్సవ్

ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ముఖ్యఅతిథులు

సుభాష్‌నగర్, ఆగస్టు 17 : జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో యువ కళోత్సవ్ - 2024 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా డ్యాన్స్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్త్రీ వైద్యనిపుణురాలు అర్చన హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి పలు విభాగాల్లో యువతీయువకులు నృత్యాలు ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

చిరుత దాడిలో గొర్రె మృతి

సారంగాపూర్/ వినాయక్‌నగర్, ఆగస్టు 17 : మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామశివారులో గొర్రెల మందపై చిరుత దాడి చేసి ఓ గొర్రెను చంపిన ఘటన రెండురోజుల క్రితం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మన్‌పల్లికి చెందిన ఆరుగురు గొర్రెల కాపరులు గొర్రెల మందలను మేపి, మల్కాపూర్ గ్రామశివారులోని మల్లన్న ఆలయ సమీపంలో రాత్రిపూట ఉంచారు. మందపై చిరుత దాడి చేసి ఓ గొర్రెను చంపింది. ఉదయం గొర్రె కళేబరాన్ని చూసిన కాపరులు, చిరుత దాడి చేసినట్లు గుర్తించి, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో సంజీవ్‌గౌడ్, ఏరియా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జాహూర్ ఘటనాస్థలాన్ని, గొర్రె కళేబరాన్ని శనివారం పరిశీలించారు. చిరుత పాదముద్రలేనని, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టీయూలో ఘనంగా తీజ్

- హాజరైన సేవాలాల్ మహరాజ్ వారసుడు రమేశ్ మహరాజ్

వేడుకలో పాల్గొన్న రమేశ్ మహరాజ్, అధ్యాపకులు, విద్యార్థినులు

డిచ్‌పల్లి, ఆగస్టు 17 : టీయూలో గిరిజన శక్తి ప్రెసిడెంట్ శ్రీనూనాయక్ ఆధ్వర్యంలో తీజ్ వేడుకను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ మహరాజ్ వారసుడు రమేశ్ మహరాజ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం తీజ్‌ను అధికారికంగా నిర్వహించాలని కోరారు. అధ్యాపకులు, విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా తీజ్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక, ప్రొఫెసర్ శాంతాదేవి, సాగర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, శ్రీకాంత్, మోహన్, చందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

వివరాలను వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

ఇందల్వాయి, ఆగస్టు 17 : బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని చెప్పి సైబర్ మోసానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో సీఐ మల్లేశ్ శనివారం విలేకరులు సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఇందల్వాయి మండలంలోని స్టేషన్ తండాకు చెందిన బదావత్ ఉపేంద్రనాయక్‌కు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తీగుట్ల మనోజ్ కుమార్ ఇటీవల ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని.. గోల్డ్‌లోన్ డబ్బులు చెల్లించాలని లేకపోతే గోల్డ్ తీసివేస్తామని చెప్పడంతో ఉపేంద్రనాయక్ రూ. 25 వేలు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాడు. అనంతరం మోసపోయినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తీగుట్ల మనోజ్‌కుమార్‌గా గుర్తించి, శనివారం అక్కడికి వెళ్లి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు పంపవద్దని, సైబర్‌నేరాల బారిన పడితే వెంటనే 1930కు కాల్ చేయాలని సీఐ సూచించారు. సమావేశంలో ఎస్సై మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఎత్తుకెళ్లిన వారిపై కేసు నమోదు

పొతంగల్, ఆగస్టు 17 : పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇటీవల సీజ్ చేసిన ఇసుక డంపులను ఎత్తుకెళ్లిన వ్యక్తులపై తహసీల్దార్ మల్లయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలకేంద్రంలోని మంజీర బ్రిడ్జి సమీపంలో ఈ నెల 13న అధికారులు సీజ్ చేసిన 18 ట్రాక్టర్ల ఇసుక డంపులను రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన రెవెన్యూ అధికారులు పక్కా ఆధారాలతో మండలంలోని ఓ వ్యక్తికి చెందిన పొక్లెయినర్‌ను పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పొక్లెయినర్ యజమానితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికురాలు మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 17 : నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలో సాయికృపాకాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి పడి కార్మికురాలు శుక్రవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కవిత (29) సాయికృపానగర్‌లో భవనంపై పనిచేస్తున్న సమయంలో కిందపడి మృతిచెందింది. తన భర్తతో గొడవ జరగడంతో రెండు రోజులుగా భోజనం చేయపోవడంతో కండ్లు తిరిగి కిందపడి మృతిచెందినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మొదట నిరాకరించినా శనివారం ఫోర్త్ టౌన్‌లో ఫి